ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న కేర్ ఆస్పత్రి వైద్యులు

రంగారెడ్డినగర్: స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నాంపల్లి కేర్ ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం గాంధీనగర్‌లోని కమ్యూనిటీ హాలులో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండె, డయాబెటీస్, బీపీ ఇతర సాధారణ వ్యాధులతో బాధ పడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి వైద్య సలహాలతో పాటు ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ సీమా పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో సుమారు 120 మంది పరీక్షలు చేయించుకున్నారు. సీనియర్ నాయకులు జల్దా రాఘవులు, ఖాజా మియా, ఎల్లయ్య, యువజన సంఘం అధ్యక్షుడు లక్ష్మీనాథ్, సాయిగౌడ్, శ్రీనివాస్, యాదిరెడ్డి, తిమ్మయ్య, నవీన్, దత్తు, రాంచందర్ పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే చదువొక్కటే మార్గం



కార్యక్రమంలో మాట్లాడుతున్న మధుబాబు

జగద్గిరిగుట్ట: సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే చదువు ఒక్కటే మార్గమని ప్రపంచ మానవ హక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలే అన్నారు. సోమవారం ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని గాజులరామారం డివిజన్, అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందానికి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు చెబుతున్న గురువులను సత్కరించుకోవడం మన ధర్మమని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఎల్లయ్య, సూర్యం, వలంటీర్ టీచర్ భాగ్యను ఆయన సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమర్ కాంబ్లె, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-320డి సభ్యులు

రంగారెడ్డినగర్: గురుమూర్తినగర్ జీడీపీహెచ్ తెలుగు ఉపాధ్యాయుడు సత్యనారాయణమూర్తిని సోమవారం రవీంద్రభారతిలో జరిగిన ఉపాధ్యాయుల దినోత్సవ వేడుకల్లో సత్కరించారు. లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-320డి లయన్ కల్యాణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి మెమొంటోలు అందజేశారు. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంతో గురువుల కృషి ఎంతో ఉందన్నారు. వారిని సత్కరించడం సంతోషంగా ఉందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ సత్యనారాయణ, ఇతర లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 13 ఫిర్యాదులు

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం ప్రజావాణిలో మొత్తం 13 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో టౌన్ ప్లానింగ్ విభాగం 5, ఇంజినీరింగ్ 6, శానిటేషన్, యూబీడీ విభాగంపై రెండు ఫిర్యాదులు వచ్చినట్లు ఉప కమిషనర్లు మల్లారెడ్డి, నరసింహులు తెలిపారు. ఏపీహెచ్‌బీ కాలనీలో ఉన్న రెండు పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌ను తవ్వి వదిలేయడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధి సాయికిరణ్ ఫిర్యాదు చేశారు. సూరారం రాజీవ్ గృహకల్ప బ్లాక్-9లో నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయంపై కాలనీవాసులతో కలిసి గుబ్బల లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేశాడు. అదే విధంగా వివిధ సమస్యలపై ప్రజలు నేరుగా జంట సర్కిళ్ల పరిధిలో ఫిర్యాదుల పర్వం కొనసాగించారు. సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

కోటి దీపోత్సవానికి ఆహ్వానం

జగద్గిరిగుట్ట: గాజులరామారంలో కోటి దీపోత్సవం వాల్‌పోస్టర్‌ను సోమవారం షాపూర్‌నగర్‌లో ప్రధాన అర్చకులు నందు పంతులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి ఉత్సవాలకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు జరిగే ఈ కోటి దీపోత్సవం సందర్భంగా... 24న లక్ష్మీనరసింహస్వామి కల్యాణం, 25న శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, 26న చిత్తారమ్మ లక్షగాజుల అర్చన, 27న శివపార్వతుల కల్యాణం, 28న వల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్య స్వామి కల్యాణం ఉంటుందని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోమాది కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఎట్టకేలకు స్వాధీనం.!

ఐడీపీఎల్ చౌరస్తాలోని టీజీహెచ్‌బీ స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు

- ఓ ప్రజాప్రతినిధి అండతో మళ్లీ పాగా వేసేందుకు యత్నం
- మళ్లీ స్థలాన్ని ఆనుకునే ఇసుక, కంకర వ్యాపారాలు
- టీజీహెబీ స్థలంలోనే సిట్టింగ్‌లు.. అక్కడి నుండే దందా



టీజీహెచ్‌బీ స్థలంగా పేర్కొంటూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులు

రంగారెడ్డినగర్: కోట్లాది రూపాయల విలువ చేసే తెలంగాణ హౌసింగ్ బోర్డు స్థలం ఎట్టకేలకు కబ్జా చెర నుంచి విముక్తి పొందింది. వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఐడీపీఎల్ చౌరస్తాకు ఆనుకుని తెలంగాణ హౌసింగ్ బోర్డుకు సంబంధించిన సర్వే నం. 144 నుంచి 149లో 2.25 ఎకరాల స్థలాన్ని కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి వదిలిపెట్టారు. అయితే సదరు స్థలాన్ని కృషి ఇంజినీర్లు మరికొందరు తమదని పేర్కొనడంతో ఈ విషయమై సర్వేకు అనుమతించాలని కోరుతూ అప్లికేషన్ నం. 361 ఆఫ్ 2010ను అప్పటి ఉమ్మడి రాష్ట్రంలోని ఏపీహెచ్‌బీ తరపున హైకోర్టులో ఆర్జీ పెట్టారు.

◆ దీంతో అప్పటి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సర్వేయర్ నేతృత్వంలో 2011 అక్టోబరు 9, 10వ తేదీల్లో సర్వే చేపట్టి ఏపీహెచ్‌బీకి చెందిన స్థలంగా తేల్చారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణ స్టేట్ హౌసింగ్ బోర్డుగా ఆధీనంలోకి సదరు స్థలం వెళ్లింది. అయితే హౌసింగ్ బోర్డు అధికారులు ఆపై స్థలాన్ని పరిరక్షించే విషయంలో సరైన చర్యలు తీసుకోకపోవడంతో కొందరు స్థానిక లారీ అసోసియేషన్ సభ్యుల కన్ను సదరు స్థలంపై పడింది. దీంతో ఎంచక్కా స్థలంలో భవన నిర్మాణానికి ఉపయోగించే ఇసుక, కంకర, ఇటుక వంటివి డంప్ చేస్తూ వ్యాపారాన్ని కొనసాగిస్తు వచ్చారు.

◆ ఈ క్రమంలో ఐడీపీఎల్ చౌరస్తాను విస్తరించే క్రమంలో టీఎస్‌హెచ్‌బీ అధికారులు సదరు 2.25 ఎకరాల చుట్టూ ప్రహరీని నిర్మించారు. అయినా ఇసుక, ఇటుక, కంకర వ్యాపారాలకు మాత్రం అడ్డుకట్ట పడలేదు.. ఈ నేపథ్యంలో ఇటీవల హైకోర్టు టీజీహెచ్‌బీకి అనుకూలంగా మరోసారి తీర్పు వెలువరించడంతో అధికారులు స్థలంలో కొనసాగుతున్న ఇసుక, కంకర, ఇటుక వ్యాపారాలను తొలగించి, సదరు స్థలం టీజీహెచ్‌బీకి చెందినదిగా అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు.

టీజీహెచ్‌బీ స్థలాన్ని ఆనుకునే వ్యాపారాలు..

టీజీహెచ్‌బీ అధికారులు స్థలాన్ని స్వాధీనం చేసుకున్నా సదరు స్థలంపై నీలినీడలు కొనసాగుతూనే ఉన్నాయి.. ఐడీపీఎల్ స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీని ఆనుకునే కంకర, ఇటుక, ఇసుక వ్యాపారాలు కొనసాగించడం గమనార్హం. స్థలం చుట్టు ఉన్న ప్రహరీని అక్కడక్కడ తొలగించారు. సదరు లారీ ఓవర్స్ అసోసియేషన్ నిర్వాహకులు టీహెచ్‌బీ స్థలంలో టేబుళ్లు, కుర్చీలు వేసుకుని తమ దందాను కొనసాగిస్తూనే ఉన్నారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణ సామగ్రిని డంప్ చేయడంతో పాటు టిప్పర్లు, ట్రాక్టర్లను నిలుపుతున్నారు. అయితే వీరి బరి తెగింపు వెనుక ఓ ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో టీజీహెచ్‌బీ స్థలాన్ని లారీ ఓనర్స్‌కు లీజుకు ఇవ్వాల్సిందిగా సదరు ప్రజాప్రతినిధి టీజీహెచ్‌బీ అధికారులకు సిఫార్స్ లేఖ రాయడం వివాదాస్పదమైంది. సదరు ప్రజాప్రతినిధికి కంకర, ఇటుక, ఇసుక వ్యాపారస్తులు మమూళ్లు ఇస్తుండటంతో వంత పాడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

టీజీహెచ్‌బీ రాబడికి ఎగనామం..



రోడ్డు కబ్జా చేసి నిర్మాణ సామగ్రి, భారీ వాహనాల అక్రమ పార్కింగ్

జీహెచ్‌ఎంసీ ఆదాయానికి గండి..

టీఎస్‌హెచ్‌బీ ఖాళీ స్థలంలో ప్రతినిత్యం పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్లలో ఇసుక, కంకర, ఇటుకలను డంప్ చేసి వ్యాపారాలు నిర్వహించిన లారీ అసోసియేషన్ సభ్యులు జీహెచ్‌ఎంసీకి మాత్రం పన్నులు చెల్లించలేదని తెలుస్తోంది. దీంతో జీహెచ్‌ఎంసీ లక్షల్లో ఆదాయం కోల్పోతోంది.. ఇంత బహిరంగంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నా ఏ ఒక్క జీహెచ్‌ఎంసీ అధికారి సదరు వ్యాపారులకు చలాన్‌లు విధించక అనుమానాలకు తావిస్తోంది. ఐడీపీఎల్ చౌరస్తాను ఆనుకుని టీజీహెచ్‌బీ స్థలం నుంచి ఏపీహెచ్‌బీ కాలనీకి ఏర్పాటు చేసిన రోడ్డుపై ప్రస్తుతం కంకర, ఇసుక, ఇటుకలను డంప్ చేసి వ్యాపారాలు నిర్వహిస్తున్నా అధికారుల కళ్లకు కనిపించకపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేస్తారా లేదా అన్నది వేచి చూడాలి.



ప్రహరీని ఆనుకునే ఇటుక, కంకర, డస్ట్ డంప్

టీజీహెచ్‌బీ స్థలంలో పాగా వేసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ నయా పైసా చెల్లించకుండానే ఏళ్ల తరబడి వ్యాపారాలు కొనసాగించారు. అయితే ఇటీవల టీజీహెచ్‌బీ ఆధీనంలోని 2.25 ఎకరాల స్థలాన్ని తీసుకుంది. ఇప్పటి వరకు వ్యాపారాలు కొనసాగించిన వారి నుంచి లక్షల్లో టీజీహెచ్‌బీకి ఆదాయం రావాల్సి ఉంది. అయితే టీజీహెచ్‌బీ అధికారులు సదరు నిర్వాహకులకు ఇప్పటి వరకు నోటీసులు జారీ చేసిన దాఖలాలు లేవు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి పడింది. దీంతో ఇన్నేళ్లుగా సదరు వ్యాపారుస్తులు అప్పనంగా ప్రభుత్వ స్థలాన్ని వాడుకుని లక్షల్లో ఆదాయాన్ని గడించినా టీజీహెచ్‌బీ రాబడికి మాత్రం ఎగనామం పెట్టారన్నది బహిరంగ రహస్యం.

కూల్చిన చోటే మళ్లీ నిర్మాణాలు



మూడు వారాల క్రితం గదుల నిర్మాణం కూల్చివేసిన అధికారులు

జగద్గిరిగుట్ట: అధికారులు కూల్చిన కొద్ది రోజుల్లోనే మళ్లీ నిర్మాణం చేపట్టి సవాలు విసురుతున్నారు. జగద్గిరిగుట్ట రింగ్ బస్తీలో ఉన్న అనాథాశ్రమ స్థలంలో వెలిసిన అక్రమ నిర్మాణాలపై గత నెల 19న 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించి నిర్మాణాలు కూల్చారు. కాగా మళ్లీ అదే స్థలంలో తిరిగి నిర్మాణాలు చేపట్టడం విశేషం. వినాయక చవితి పనులలో అధికారులు బిజీ ఉండటం.. నిఘా లోపించడంతో మళ్లీ నిర్మాణాలు చేపట్టారు. కాగా ఓ కుటుంబం పండుగ రోజు గృహ ప్రవేశం కూడా జరుపుకున్నట్లు సమాచారం. సంబంధిత శాఖ అధికారులు వీరిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అదే స్థలంలో మళ్లీ నిర్మాణం

వీధి కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు

- మున్సిపల్ పరిధిలో 1874 కుక్కలకు టీకాలు
- నేడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ క్యాంపు



దుండిగల్‌లో వీధి కుక్కలను పట్టుకుంటున్న బ్లూక్రాస్, మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలకు బ్లూక్రాస్ సొసైటీ భాగస్వామ్యంతో స్టెరిలైజేషన్, యాంటీ రేబీస్ టీకాలు వేయిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ తెలిపారు. సోమవారం బ్లూక్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది వీధి కుక్కలను పట్టుకుని టీకాలు వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... మున్సిపల్ పరిదిలో 2659 వీధి కుక్కలను గుర్తించామని అన్నారు. వాటిలో 1874 కుక్కలకు యాంటీ రేబీస్ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. బ్లూక్రాస్ సొసైటీ సిబ్బంది అన్ని వార్డులలో తిరుగుతూ వీధి కుక్కలను పట్టుకొని స్టెరిలైజేషన్ చేస్తున్నారని తెలిపారు. మూడు నెలలకోసారి పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ క్యాంపు ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 9వ తేదీన దుండిగల్ వార్డు కార్యాలయంలో కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ క్యాంపు ఉంటుందన్నారు. పెంపుడు కుక్కలకు వ్యాక్సిన్ వేయించాలని కోరారు. చిన్న పిల్లలను వీధి కుక్కలకు దూరంగా ఉంచాలని సూచించారు. పిల్లల ఉన్న తల్లి కుక్కల వద్దకు వెళ్లకూడదని సూచించినారు, జంతు ప్రేమికులు కుక్కలకు ఆహారం, నీరు ఇచ్చే విషయంలో జన సంచారాలు లేని ఏరియాలో పెట్టాలని తెలిపారు. వీధి కుక్కలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే ఫోన్ నం .88853 43470, 79958 24443కు ఫిర్యాదు చేయాలని కోరారు.

భవిష్యత్ తరమంతా ఆధునిక సాంకేతికతతోనే..



సాక్షి, సిటీబ్యూరో: పరిశోధన ప్రాముఖ్యత, నాణ్యమైన విద్యా ప్రమాణాల పరిరక్షణ, విస్తృత స్థాయిలో ఉన్న అంతర్జాతీయ ఉపాధి అవకాశాలు, భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దడంలో ఇంజినీరింగ్ విద్య ప్రత్యేకతలను ప్రదర్శించేలా నగరంలోని గోకరాజు లైలావతి మహిళా ఇంజినీరింగ్ కాలేజ్ మొదటి కాన్వొకేషన్ వేడుక జరిగింది. ఈ వేడుకల్లో ఓయూ వైస్ చాన్సలర్ ప్రొ. కుమార్ ముఖ్యఅతిథిగా హాజరూ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన పట్టభద్రులకు తాత్కాలిక సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి టెలిపర్ఫార్మెన్స్ గ్లోబల్ బిజినెస్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ప్రెసిడెంట్ వెంకటశివరావు గౌరవ అతిథిగా హాజరై విద్యార్థులకు భవిష్యత్ తరం సాంకేతికత ప్రమాణాలు, ఆవశ్యకతలను వివరించారు. ఈ వేడుకలో రిజిస్ట్రార్ డాక్టర్ కేవీఎస్ రాజు, ప్రిన్సిపాల్ డా. సాయిహనుమాన్, అధ్యాపకులు పాల్గొన్నారు.



స్వయం పరిపాలన దినోత్సవం



జీడిమెట్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి, విద్యార్థులు అనుకున్నది సాధించేందుకు దోహద పడే ఏకైక వ్యక్తి ఉపాధ్యాయుడేనని సుభాష్‌నగర్ బోధివృక్ష ఒలింపియాడ్ పాఠశాల ప్రిన్సిపల్ సి.హెచ్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పాఠశాలలో టీచర్స్‌డేతో పాటు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు టీచర్లుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. అదేవిదంగా తమకు ప్రతినిత్యం పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు విద్యార్థులు మెమోంటో, శాలువాలతో సత్కరించారు. అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఆటల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు వెంకటరెడ్డి, భార్గవిరెడ్డి ఉపాధ్యాయులు గోదావరి, రాధిక, శిరీష, శ్రీలత, సౌమ్య, హెప్సిబ, భవాని, కుసుమ పాల్గొన్నారు.

ఒకే అపార్ట్‌మెంట్.. రెండు సైకిళ్ల చోరీ



జగద్గిరిగుట్ట: ఆరు నెలల వ్యవధిలో ఒకే అపార్ట్‌మెంట్‌లో రెండు సైకిళ్లను ఓ వ్యక్తి దొంగిలించాడు. చింతల్ పద్మానగర్ ఫేజ్-1, స్ట్రీట్ నం .11లోని శ్రీగాయత్రి ఎవెన్యు అపార్ట్‌మెంట్‌లో ఆదివారం సైకిల్ దొంగతనం జరిగింది. అందరు ఇంట్లో ఉన్న సమయంలో మధ్యాహ్నం 2గంటల ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. అప్పటి వరకు అక్కడే ఆడుకున్న బాలుడు (తేజు) సైకిల్ పార్కింగ్‌లో పెట్టి వెళ్లిన 10 నిమిషాలకే ఇది జరిగింది. సీసీ కెమెరాల ఆధారంతో ఆ వ్యక్తి వేసుకున్న దుస్తులను బట్టి అతడు ఓ సెక్యూరిటీ గార్డుగా గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల దందాపై విచారణ జరపాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆకుల సతీష్

నిజాంపేట్: అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల దందాపై విజిలెన్స్ విచారణ జరపాలని ఆకుల సతీష్ సోమవారం అడిషనల్ కలెక్టర్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్, దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డుల వల్ల సంవత్సరానికి రూ.50లక్షలపై చిలుకు ఆదాయం వచ్చేదన్నారు. నూతన అడ్వర్‌టైజ్‌మెంట్ పాలసీ ఏర్పాటు చేస్తామని అప్పటి వరకు ఎలాంటి అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేయొద్దని.. పాత అడ్వర్‌టైజ్‌మెంట్ రెన్యువల్ చేయొద్దని సీడీఎంఏ స్పష్టంగా సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. దీంతో మూడు సంవత్సరాల నుంచి మున్సిపాలిటీలకు రూపాయి ఆదాయం రావడం లేదన్నారు. కానీ హోర్డింగ్స్ ఏర్పాటును అధికార పార్టీ నేత ఒకరు, మున్సిపల్ కమిషనర్లు ఏర్పాటు చేయడంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు.

కమిషనర్ దృష్టికి ప్రగతినగర్ ప్రధాన సమస్యలు



నిజాంపేట్: ప్రగతినగర్ వ్యవస్థాపకులు, మాజీ ఉపసర్పంచ్ చల్లా సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పార్టీలు, అసోసియేషన్లకు అతీతంగా ప్రగతినగర్ ప్రధాన సమస్యలపై మున్సిపల్ కమిషనర్ ఎండీ సాబేర్ అలీతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రగతినగర్ ప్రధాన సమస్య శ్మశానవాటిక సమస్య, అంబిర్ సరస్సు ఆక్రమణలు, బతుకమ్మ ఘాట్ అభివృద్ధి పలు అంశాలపై చర్చించారు. శ్మశానవాటిక సమస్య కోసం ఎన్ఎంసీ కమిషనర్ ఆధ్వర్యంలో స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. బతుకమ్మ ఘాట్‌లో బతుకమ్మ విగ్రహం, ప్రజలకు టాయిలెట్స్, స్టేజ్ సౌకర్యాలు కల్పించేలా నిర్ణయం తీసుకున్నారు. అనంతరం వినాయక చవితికి వర్షాకాలంలో అత్యవసర బృందాల ఏర్పాటు వారు కల్పించిన సౌకర్యాల వల్ల వినాయక నిమజ్జనం విజయవంతంగా ముగిసిందన్నారు. ఎన్ఎంసీ మాజీ కార్పొరేటర్లు చిట్ల దివాకర్, చల్లా ఇంద్రజిత్ రెడ్డి, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు అరవింద్ నాయుడు, తులసి దాస్, వెంకటరాజ్యం, ఉప్పు జస్వంత్, రమేష్, నబి, కామయ్య, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సన్మానం



సూరారం పోలీసులను సన్మానిస్తున్న హరికిరణ్

సుభాష్‌నగర్: వినాయక నవరాత్రి, నిమజ్జనంలో ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా జరిగేలా పోలీసులు పటిష్ట భద్రత కల్పించడం అభినందనీయమని సుభాష్ నగర్ డివిజన్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికిరణ్ పటేల్ అన్నారు. గణేష్ నిమజ్జనాన్ని విజయవంతంగా ప్రశాంతమైన వాతావరణంలో జరిపినందుకు సుభాష్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సూరారం సీఐ. సుధీర్ కృష్ణ, ఎస్సైలు మురళీగౌడ్, రాజు, కృష్ణ, లిమా, కృష్ణనాయక్ పోలీసు సిబ్బందిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హరికిరణ్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ప్రతి వేండుగను ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాంతి వాతావరణంలో జరుపుకుంటున్నారంటే దాని వెనకాల పోలీస్ భద్రతే అని అన్నారు. ఈ కార్యక్రమంలో చందు, గోగికర్ కరణ్, జానీ, మనీ, తరుణ్, అభి, అమాల్ పాల్గొన్నారు.

నేనేవరో తెలీదారా.? అంటూ ఇద్దరిపై దాడి



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

జీడిమెట్ల: చిన్న విషయానికే 'నేనేవరో తెలీదారా.? అంటూ ఓ వ్యక్తి మరో ఇద్దరు వ్యక్తులను తీవ్రంగా పిడిగుద్దులతో విరుచుకుపడి గాయపరిచిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టీఎస్ఐఐసీ కాలనీకి చెందిన వేతి మహేష్ అనే వ్యక్తి శనివారం రాత్రి 11గంటలకు టీఎస్ఐఐసీ కాలనీలోని తన కార్యాలయం వద్ద తన ద్విచక్రవాహనం నిలిపి అతడి బావ సురేష్‌తో మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో పూటుగా మద్యం సేవించి అక్కడకు వచ్చిన ఓ యువకుడు మహేష్, సురేష్‌లతో గొడవపడి అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

పిడిగుద్దులతో దాడికి పాల్పడిన సిద్దిఖ్..

కొద్ది నిముషాల్లోనే షాపూర్‌నగర్ ఎలైట్ అపార్ట్‌మెంట్‌కు చెందిన సిద్దిఖ్(39) అనే వ్యక్తి సురేష్ కార్యాలయం వద్దకు చేరుకున్నాడు. వచ్చి రావడంతోనే మహేష్, సురేష్‌లపై పిడిగుద్దులతో పాటు తీవ్రంగా తన్నడం ప్రారంభించాడు. తీవ్రంగా గాయపడిన మహేష్, సురేష్‌లు చేసేది ఏమిలేక ఈ విషయమై జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి సిద్దిఖ్‌పై బీఎన్ఎస్ యాక్ట్ 115(2), 351(2),(3), 328(4),(3)(5) కింద కేసు నమోదు చేశారు.

కొంపల్లిలో డీ-గ్యాంగ్.!

- కట్టడి చేయడంలో పోలీసుల విఫలం
- తొమ్మిది రోజుల వ్యవధిలో ఐదు ఘటనలు
- అన్ని గొడవలకు ఒక్కడే కారణం



కుత్బుల్లాపూర్: కొంపల్లిలో రోజుకో గ్యాంగ్‌వార్ జరుగుతోంది. పేట్‌బషీరాబాద్ పోలీసులకు సమాచారం ఉన్నప్పటికీ వారిపై చర్యలు తీసుకోకపోవడంతో మరింత రెచ్చిపోతున్నారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో ఒకవైపు పూజలు జరుగుతుండగా మద్యం తాగి మత్తులో తూగుతున్న కొంతమంది యువకులు అదే పనిగా గొడవలు చేసుకుంటూ వచ్చారు. కొంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ డ్రైవర్ శివతో పాటు స్థానికంగా ఉండే సాయి మొదలుకొని తాజాగా టిఫిన్ సెంటర్ వద్ద జరిగిన గొడవలో తీవ్రంగా గాయపడ్డ భువనేశ్వర్‌రెడ్డి సైతం ఈ గ్యాంగ్ బారిన పడ్డారు.

◆ తొమ్మిది రోజులుగా వివిధ ప్రాంతాల్లో గొడవలు చేస్తూ వస్తున్నా.. వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో తాజాగా కొంపల్లి టిఫిన్ సెంటర్ వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన గొడవ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సమాచారం తెలిసిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి వెళ్లినప్పటికీ ఈ గొడవలో తీవ్రంగా గాయపడ్డ ఓ వ్యక్తిని ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో సైతం కారుపై దాడి చేశారు. అంతేకాకుండా గాయపడ్డ ఆ వ్యక్తితో గ్యాంగ్ లీడర్‌గా వ్యవహరిస్తున్న ఆదిరెడ్డి దినేష్ రెడ్డి కాళ్లు మొక్కించుకోవడం గమనార్హం.

◆ తొమ్మిది రోజుల వ్యవధిలో ఏకంగా ఐదు సంఘటనల్లో బాధ్యుడిగా ఉన్న దినేష్‌రెడ్డి గ్యాంగ్ (డీ-గ్యాంగ్)ను కట్టడి చేయడంలో పోలీసులు విఫలమయ్యారు అన్నది ప్రధాన ఆరోపణ. రాత్రి కాగానే పూర్తిగా మద్యం సేవించి రోడ్లపై కనిపించిన వారిపై దాడులకు దిగుతున్నారని స్థానికులే చెబుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారణ చేపడితే మరిన్ని దాడుల విషయాలు వెలుగులోకి వస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.